జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
WWW.DASHANEWS.COM
బుధవారం 08-07-2026
సంపుటి 1 సంచిక 225
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




# తెలంగాణ కాంగ్రెస్ లో మరో అలజడి

వివరాలు 4లో

# గులాబీకి మల్లారెడ్డి గుడ్‌బై..?

**రాజకీయ వర్గాల్లో జోరుగా ఊహాగానాలు**

**'నన్ను మర్చిపోతున్నారు' వ్యాఖ్యలతో మొదలైన చర్చ**

**పార్టీ మార్పుపై పెరుగుతున్న ప్రచారం**



**దశ, హైదరాబాద్:** మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఓ కార్యకర్త జన్మదిన వేడుకలో పాల్గొన్న సందర్భంగా "బీఆర్ఎస్‌కు దూరమయ్యానని నన్ను మర్చిపోతున్నారు" అని ఆయన

..మిగతా 4వ పేజీలో →




# నాణ్యతలో రాజీ లేదు

## పిల్లల ఆరోగ్యమే తెలంగాణ భవిష్యత్తు: సీఎం రేవంత్ రెడ్డి

**దశ, హైదరాబాద్:** పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలే ఆరోగ్యకరమైన తెలంగాణకు, దేశానికి మంచి పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ నాచారం ఐడీఏలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన బాలామృతం ఉత్పత్తి కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఉత్పత్తి, ప్యాకింగ్ యూనిట్‌ను పరిశీలించి, ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి ఆరు సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ ఆధునిక బాలామృతం ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్య లేకపోవడంతో పేద కుటుంబాలు

..మిగతా 4వ పేజీలో →

### డిజిటల్ గవర్నెన్స్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్

**100 రోజుల్లో కార్యాచరణ..**

**కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల వ్యవస్థ పూర్తి డిజిటలైజేషన్‌కు ఆదేశాలు**

వివరాలు 4లో

# తెలంగాణ రోడ్లకు కొత్త దిశ

**ఇబ్రహీంపట్నానికి 338 కోట్ల భారీ వరం**

**149 కి.మీ. ఫోర్‌లేన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం**

**అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి**

**ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం**

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** దేశమంతా తెలంగాణ రహదారుల అభివృద్ధి వైపు చూసేలా అత్యున్నత ప్రమాణాలతో రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్ల వ్యయంతో 34 ప్యాకేజీల్లో 6,092 కి.మీ. పొడవున 441 హ్యామ్ (HAM) రహదారుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రూ.338 కోట్లతో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో 149 కి.మీ. మేర 14 ఆధునిక హ్యామ్ ఫోర్‌లేన్ రహదారుల నిర్మాణ పనులకు తొర్రూర్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో

..మిగతా 4వ పేజీలో →



# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం..

**రూ.360 కోట్లతో రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు**

**107 తహసీల్దార్, 10 ఆర్డీవో, 53 రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**దశ, హైదరాబాద్ :** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేసి ప్రజలకు ఆధునిక, పారదర్శక సేవలు అందించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని దశలవారీగా చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

..మిగతా 4వ పేజీలో →

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

**హైడ్రా తరహాలో ప్రత్యేక అమలు విభాగం**

**ఫుడ్ సేఫ్టీ–డ్రగ్ కంట్రోల్ విలీనం..**

**కల్తీ, నకిలీ మందుల నియంత్రణకు ప్రభుత్వం కొత్త కార్యాచరణ**





**దశ, హైదరాబాద్:** తెలంగాణలో ఆహార కల్తీ, నకిలీ ఔషధాలు, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అమలు వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం విడివిడిగా పనిచేస్తున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే పరిపాలనా వ్యవస్థ కిందకు తీసుకువచ్చే ప్రతిపాదనపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ కొత్త వ్యవస్థకు ఒకే విభాగాధిపతి ఉండగా, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), లీగల్, ప్రాసిక్యూషన్ విభాగాలను కూడా సమన్వయంతో పనిచేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఆహార కల్తీ, నకిలీ మందుల తయారీ, అక్రమ రవాణాపై

..మిగతా 4వ పేజీలో →

### టీఆర్ఎస్ పేరు వివాదం కవితకు హైకోర్టు తాత్కాలిక ఊరట

4లో



**ప్రియుడి కోసం భర్త హత్య..**

### 7 నెలల తర్వాత వెలుగులోకి నిజం

**మిస్సింగ్ కేసు దర్యాప్తులో భార్యే హంతకురాలని తేల్చిన పోలీసులు..**

**మహారాష్ట్ర సరిహద్దులో మృతదేహం వెలికితీత**

4లో

# బీటెక్ ఉద్యోగుల కంటే శానిటేషన్ సిబ్బందికే ఎక్కువ జీతాలు?

**జీహెచ్ఎంసీ ఐటీ నియామకాల వేతనాలపై చర్చ.. పే స్కేల్ సవరణ కోరుతున్న అభ్యర్థులు**

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) విడుదల చేసిన ఐటీ ఔట్‌సోర్సింగ్ నియామకాల నోటిఫికేషన్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఐటీ నిపుణులకు ప్రతిపాదించిన వేతనాలు, జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది వేతనాలతో పోలిస్తే తక్కువగా ఉండటంపై ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒక సంవత్సరం కాలపరిమితిపై 25 మంది ఐటీ నిపుణులను ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించేందుకు జీహెచ్ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో హార్డ్‌వేర్

..మిగతా 4వ పేజీలో →






# డిజిటల్ పాలిటిక్స్ వర్సెస్ రోడ్ పాలిటిక్స్

**కేటీఆర్ ఆన్‌లైన్ వ్యూహం..**

**కవిత క్షేత్రస్థాయి పోరాటం – తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు**

4లో



### నిద్రిస్తున్న వృద్ధురాలిపై అత్యాచారయత్నం కలకలం

4లో

## కుంట్లూరు నూతన కురుమ సంఘం ఎన్నిక



**దశ, అబ్దుల్లాపూర్ మెట్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఎంఎంసీ నాగోల్ సర్కిల్ కుంట్లూరు గ్రామం నూతన కురుమ సంఘం ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కురుమ కుల పెద్దల సమావేశంలో కురుమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్ద కురుమ దడిగ కొమురయ్యకురుమ, శేలోజీ కంకల సత్తయ్యకురుమ, అధ్యక్షులుగా నీళ్ల జంగయ్య కురుమ, ప్రధాన కార్యదర్శిగా పల్లె మల్లేశం కురుమ, కోశాధికారిగా కోడూరి అశోక్ కురుమ, ఉపాధ్యక్షులుగా రావుల నరసింహ కురుమ, అచ్చిన శీను కురుమ, గుత్తి రమేష్ కురుమ, బండ శంకరయ్య కురుమ, కార్యదర్శులుగా నర్రి శ్రీశైలం కురుమ, కొత్త కురుమ మల్లేష్ కురుమ, కొండే ప్రదీప్ కురుమ, బర్ల లింగస్వామి కురుమ, సహాయ కార్యదర్శులుగా పాలంచి రాజు కురుమ, మీస బాలరాజు కురుమ, మంగ కృష్ణ కురుమ, మంగ నరసింహ కురుమ, గౌరవ సలహాదారుగా కప్పే రమేష్ కురుమ, అదే మల్లేష్ కురుమ, జమ్ము వీరభద్రం కురుమ, కమిటీ సభ్యులుగా జమ్ము యాదయ్య కురుమ, అరిగే లింగస్వామి కురుమ, ఒగ్గు అయోధ్య కురుమ, కుండే బిక్షపతి కురుమ, నర్రి శ్రీశైలం కురుమలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కురుమ సంఘం కమిటీ సభ్యులకు కురుమ ప్రతినిధులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా మాడుగుల నవీన్ కుమార్ నియామకం



**దశసూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం అధ్యక్షులుగా మాడుగుల నవీన్ కుమార్ నియామకమయ్యారు. మంగళవారం సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు నియామక పత్రం అందజేశారు. వీరు గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్నులు పొందుతున్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా, శ్రీ వాసవి సేవాసమితి సభ్యులుగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి నియామకం పట్ల పలువురు ఆర్యవైశ్య నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి ఉప్పల శ్రవణ్ కుమార్ నాయకులు ఉప్పల సత్యనారాయణ, గుండా వెంకన్న, ఓరుగంటి రామమూర్తి, మిట్టపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మిక పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి కృషి చేస్తా

❖ *చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా గండూరి రమేష్*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి సభ్యులందరినీ కలుపుకొని కృషి చేస్తానని చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గండూరి రమేష్ అన్నారు. ఇటీవల జరిగిన సూర్యపేట చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్లు మంగళవారం కార్యాలయంలో సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గండూరి రమేష్, ఉపాధ్యక్షులుగా చిలివేరు నరసింహారావు, కార్యదర్శిగా భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ముషం హరిప్రసాద్ లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి షేక్ బాజీ తెలిపారు. అనంతరం డైరెక్టర్ల సమక్షంలో నూతన అధ్యక్షుడిగా గండూరి రమేష్ బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన సభ్యులకు, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతన డైరెక్టర్లు ముషం యాదమ్మ, విడం నీరజ, పెద్ది శ్రీనివాస్, యాలగందుల లక్ష్మయ్య, యాలగందుల సాయి నేతతో పాటు సంఘ నాయకులు కడారి బిక్షం, బాల్నే మల్లయ్య, యాలగందుల సుదర్శన్, దూలం నగేష్, ఎస్.రాములు, తదితరులు ఉన్నారు.

## 9వ రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**దశ, హైదరాబాద్:** సింగరేణి అధికారులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్పీ (PRP) బకాయిలను వెంటనే చెల్లించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (CMOAI) ఆధ్వర్యంలో రామగుండం 1 ఏరియాలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 9వ రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయినప్పటికీ వారికి రావాల్సిన పీఆర్పీ బకాయిలు, వేతనాలకు సంబంధించిన ఇతర అంశాలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. యాజమాన్యం ఈ సమస్యలను మరింత ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పీఆర్పీ బకాయిల చెల్లింపు, పెండింగ్ సమస్యల పరిష్కారం, అధికారుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని సిఎంఓఏఐ నాయకులు స్పష్టం చేశారు.

# కుంట్లూరు నాలుగు రోడ్ల కూడలిలో మళ్లీ రోడ్డుపైకి హోటల్ వ్యాపారం..!

❖ *అధికారులు స్పందించరా..? వాహనదారులకు నిత్యం నరకయాతన*

❖ *రోడ్లపై పార్కింగ్.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. ప్రమాదాలకు ఆహ్వానం*



**దశ, పెద్ద అంబర్ పేట:** మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్, కుంట్లూరు నాలుగు రోడ్ల కూడలిలో మళ్లీ రోడ్ల ఆక్రమణలు ప్రారంభమవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు దారులు కలిసే కీలక కూడలిలో ఓ హోటల్ యాజమాన్యం రోడ్లపైనే వ్యాపారం నిర్వహిస్తూ, హోటల్‌కు వచ్చే వాహనాలను కూడా రహదారిపైనే పార్కింగ్ చేయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతంలో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలు చోటుచేసుకోవడంతో స్పందించిన మల్కాజ్గిరి కార్పొరేషన్ అధికారులు రహదారులను ఆక్రమించిన చిరు వ్యాపారాలను తొలగించి ప్రజలకు ఊరటనిచ్చారు. అయితే కొద్దిరోజులు గడవకముందే మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో అధికారుల చర్యలు కేవలం తాత్కాలికంగానే మిగిలిపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం హోటల్ యాజమాన్యం రహదారిపైకి వ్యాపారాన్ని విస్తరించడమే కాకుండా, వినియోగదారుల వాహనాలను కూడా రోడ్లపైనే నిలిపివేస్తుండటంతో నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. హోటల్ యాజమాన్యానికి పలుమార్లు సూచనలు చేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించడం లేదని, సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత మాత్రమే అధికారులు మేల్కొంటారా..? ముందస్తు చర్యలు తీసుకునే బాధ్యత లేదా..? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మల్కాజ్గిరి కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసు శాఖ వెంటనే స్పందించి రహదారులపై అక్రమ వ్యాపారాలు, అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా తొలగించి, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని గ్రామస్తులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



## కాలంతో పాటు విద్యార్థులు మారాలి : రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి ముకుంద రెడ్డి

❖ *ఓయూలో ప్రారంభమైన "ఓజస్2K26"*

**దశ, ఓయూ:** కాలంతో పాటు మారాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి . ముకుంద రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల హాలు నెంబర్ 133 లో మంగళవారం జరిగిన "ఓజస్ 2K26" ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చదువు, విజ్ఞానం ఎవరి సొంతం కాదని అన్నారు. తమకు ఇష్టమైన దాన్ని నేర్చుకుని విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందని, దాన్ని బయటకు తీసుకువస్తూ ముందుకు సాగాలన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వస్తున్న విద్యార్థులు ఎంతో కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ట్స్ కళాశాలలో చదవాలనే తన జీవిత లక్ష్యం ఎం .ఏ పొలిటికల్ సైన్స్ లో చేరడంతో తీరిందన్నారు. ఓయూ విద్యార్థులకు తమ వంతు సహకారం అందించడానికి సిద్ధమేనన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యత, నైపుణ్యం ప్రతిభతో కూడిన విద్య ద్వారానే విద్యార్థులకు అవకాశాలు అందడంతో పాటు 2047 సంవత్సరం నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారు తుందని అన్నారు. ఆర్ట్స్ లేకపోతే మనిషి జీవితం ఉండదన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు రావడానికి "ఓజస్" ఒక వేదిక అని, దీనితో విద్యార్థులకు లర్నింగ్, నెట్ వర్కింగ్, ఫ్రెండ్ షిప్ సోషల్ సెన్సిటివిటీ, గ్లోబల్ కాంపిటీషన్ మొదలైనవి తెలుస్తాయని విసి పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రంగాలలో జర్మనీ, జపాన్లను చూసి ఎంతో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## వరుస పగటి చోరీల కేసులు ఛేదించిన పోలీసులు



❖ *70కి పైగా హౌస్ బ్రేకింగ్ కేసుల్లో నిందితుడు అరెస్ట్ – భారీగా బంగారం, వెండి, నగదు స్వాధీనం.*

**దశ, హయత్‌నగర్:** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన వరుస పగటి ఇంటి చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. నాలుగు చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు 42.3 తులాల బంగారు ఆభరణాలు, 87 తులాల వెండి వస్తువులు, రూ.42 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితుడు *శ్రీరామ్ నరసింహాచారి అలియాస్ నయామి అలియాస్ రాజేష్ (39)*గా పోలీసులు గుర్తించారు.

జీవనోపాధి కోసం డ్రైవర్, కార్పెంటర్‌గా పనిచేసే అతడు విలాసవంతమైన జీవితం కోసం వరుసగా ఇంటి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. గతంలో కూడా తెలంగాణలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 70కి పైగా హౌస్ బ్రేకింగ్ కేసుల్లో అతనిపై కేసులు నమోదై జైలుకు వెళ్లినప్పటికీ, బెయిల్‌పై విడుదలైన తర్వాత మళ్లీ అదే తరహా నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల హయత్‌నగర్, మునగనూరు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తలుపులు, బీరువాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదును అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. దొంగిలించిన ఆభరణాలను ఆన్‌లైన్ ద్వారా గుర్తు తెలియని




వ్యక్తులకు విక్రయించి, వచ్చిన డబ్బును ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఖర్చు చేసినట్లు విచారణలో తేలింది. విశ్వసనీయ సమాచారం మేరకు జూలై 7న మునగనూరులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని హయత్‌నగర్ పోలీసుల క్రైమ్ స్టాఫ్ అదుపులోకి తీసుకుని విచారించగా, అతడి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన వనస్థలిపురం ఏసీపీ పి. కాశిరెడ్డి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ చి. శంకరయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి. సంతోష్ కుమార్‌తో పాటు క్రైమ్ స్టాఫ్‌ను ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ డా. బి. అనూరాధ అభినందించారు.

# ఎస్ఐఆర్ పనుల్లో అధికారులు.. అనుమతులు లేని నిర్మాణాల్లో అక్రమార్కులు..!

❖ *అనుమతులు లేని నిర్మాణాలకు అడ్డుకట్ట ఎక్కడ..?*

❖ *ప్రభుత్వ ఆదాయానికి గండి.. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు*





**దశ, పెద్ద అంబర్‌పేట్:** మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్ లో ఎస్ఐఆర్ పనుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉండగా, అదే పరిస్థితిని అవకాశంగా మార్చుకున్న అక్రమార్కులు అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని నిబంధనలను తుంగలో తొక్కుతూ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అనుమతులు లేని నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణ అనుమతులు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతుండగా, సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత నోటీసులు ఇవ్వడం కంటే, ప్రారంభ దశలోనే వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయినప్పటికీ చర్యలు లేకపోవడం వల్ల అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.







## భారతీయ విలువలను కాపాడుకోవాలి

❖ *ఓయూ ఓజస్ సాంస్కృతిక సభలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి*

**దశఓయూ:** మానవ సమాజం కంప్యూటర్, ఏ ఐ యుగంలోకి వచ్చినప్పటికీ భారతీయ విలువలను, సాంస్కృతిక సంపదను, మహనీయుల తాత్వికతను కాపాడుకోవడం ద్వారానే మానవ మనుగడ తోపాటు జీవన సాఫల్యత లభిస్తుందని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం రాత్రి జరిగిన "ఓజస్2k26" సాంస్కృతిక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంజనీరింగ్, టెక్నాలజీ మొదలైన చదువులు ఎన్ని వచ్చినా నేడు లిబరల్ ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ అవసరం సమాజానికి ఎంతో ఉందన్నారు. సంపద పోగు చేయడం, వస్తువులను వినియోగించడం ద్వారానే కాకుండా సమాజంలో అనుభవాల ద్వారా ఇంటరాక్షన్ ద్వారా, కమ్యూనికేషన్ ద్వారా ఎంజాయ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న పలు కళారూపాలను వెలికి తీయడానికి ఈ సంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంటు సభ్యుడు గానే కాకుండా ప్రజాసేవలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా లోని ఎన్నారై సంజయ్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి స్వాతి పాల్గొన్నారు. సభ అనంతరం నగర వ్యాప్తంగా వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలతో ఆహుతులను అలరించారు.

## గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా పాయం వెంకటేశ్వర్లు



**దశ, మణుగూరు (టౌన్):** తెలంగాణ శాసనసభలోని అసెంబ్లీ మరియు రిజిస్టర్డ్ షెడ్యూల్డ్ తెగల ట్రైబల్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ శాసనసభ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ కమిటీ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించడం, గిరిజనుల సమస్యలను అధ్యయనం చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించడం, ప్రభుత్వానికి అవసరమైన సూచనలు అందించడం వంటి కీలక బాధ్యతలను నిర్వహించనుంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజనులకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, స్వచ్ఛమైన తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు నిర్వహించి, అధికారులతో సమీక్ష సమావేశాలు చేపడతామని ఆయన వెల్లడించారు. అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించి గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడంపై గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పారిశుధ్య చర్యలు

❖ డా. భూక్య ఉదయ జ్యోతి – ప్రసాద్ రావు



**దశ, అశ్వారావుపేట:** అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో కౌన్సిలర్ డా. భూక్య ఉదయ జ్యోతి-ప్రసాద్ రావు ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య సిబ్బందితో కలిసి డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో డ్రైనేజీల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిస్తే దోమల వ్యాప్తిని అరికట్టడంతో పాటు సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. వార్డులో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని డా. భూక్య ఉదయ జ్యోతి-ప్రసాద్ రావు తెలిపారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

❖ *బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సూచనలు*



**దశ, అశ్వారావుపేట:** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి బాధ్యతతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, బుధవారం నుంచి ప్రతి మాజీ మండల అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి, ముఖ్య నాయకుడు తమ పరిధిలో కనీసం మూడు నుంచి నాలుగు బూత్‌లను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతిరోజూ బూత్‌లను సందర్శిస్తూ అక్కడ జరుగుతున్న ప్రక్రియను పరిశీలించి, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు అందాయా లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని, ఫారాలు అందని కుటుంబాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను నింపే విషయంలో తొందరపడవద్దని, ముందుగా జిరాక్స్ కాపీపై పూర్తి వివరాలు నమోదు చేసి, ఒకటికి రెండుసార్లు సరిచూసుకున్న తర్వాత మాత్రమే అసలు ఫారాన్ని స్పష్టంగా నింపాలని తెలిపారు. చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి బూత్‌లో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, అభ్యంతరాలు, తొలగింపులు వంటి అంశాలను నిశితంగా పరిశీలించాలని, అర్హులైన ఒక్క ఓటరికి కూడా అన్యాయం జరగకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా అవకతవకలు కనిపిస్తే వెంటనే జిల్లా నాయకత్వానికి సమాచారం అందించాలని సూచించారు. ప్రతి మండల నాయకుడు ఈ కార్యక్రమాన్ని వ్యక్తిగత బాధ్యతగా తీసుకుని రోజువారీగా పర్యవేక్షించాలని, ప్రతి బూత్‌లో పార్టీ తరపున సమర్థవంతమైన సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. "ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం మనందరి బాధ్యత. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

## ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో పామాయిల్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



❖ *బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి*

**దశ, పినపాక:** పినపాక, కరకగూడెం మండలాల రైతుల సౌకర్యార్థం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో ప్రత్యేక పామాయిల్ పంట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పినపాక మండలంలోని దుగినేపల్లి, చేగర్శల, టీ.కొత్తగూడెం, జానంపేట, భూపతిరావుపేట, పాండురంగాపురం, సింగిరెడ్డిపల్లి, గడ్డంపల్లి, ఏడూళ్లబయ్యారం, పినపాక గ్రామాల్లో పెద్ద ఎత్తున రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారని తెలిపారు. అలాగే కరకగూడెం మండలంలోని అనంతారం, పద్మాపురం, మోతె, కరకగూడెం, భట్టుపల్లి గ్రామాల రైతులు కూడా పామాయిల్ పంటను విస్తృతంగా సాగు చేస్తున్నారని చెప్పారు. ఈ రెండు మండలాల రైతులు పండించిన పామాయిల్ గెలలను అశ్వారావుపేట వరకు తరలించి విక్రయించాల్సి రావడం వల్ల రవాణా ఖర్చులు అధికమవడంతో పాటు సమయం, శ్రమ కూడా వృథా అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో ఈ ప్రాంతంలో పామాయిల్ సాగు మరింత విస్తరించే అవకాశాలు ఉన్నందున, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌ను కేంద్రంగా చేసుకుని పామాయిల్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వంతో పాటు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రైతుల ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పినపాక మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, పీఏసీఎస్ చైర్మన్ ఎం. రవివర్మ, బీఆర్ఎస్ నాయకులు పొనుగోటి భద్రయ్య, పోలిశెట్టి సత్తిబాబు, జి. రామకృష్ణ, వై. చెన్నకేశవులు, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, రాయల బాబు, బుల్లిబాబు, కొండేరు నాగభూషణం, నాసర్‌రెడ్డి, సుగ్యాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## డిసిసి అధ్యక్షురాలు శ్రీదేవి లక్ష్మీ ప్రసన్నను మర్యాదపూర్వకంగా కలిసిన పేరం వెంకటేశ్వరరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో:** పినపాక మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పేరం వెంకటేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షురాలు శ్రీదేవి లక్ష్మీ ప్రసన్నను మంగళవారం కొత్తగూడెంలోని డిసిసి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు శ్రీదేవి లక్ష్మీ ప్రసన్న పేరం వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

పినపాక మండలంలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆమె అభినందనలు తెలిపారు. పేరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం శ్రమిస్తానని, కార్యకర్తల సహకారంతో మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 లక్షలతో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు భూమిపూజ

❖ *విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు*







**దశ, మణుగూరు:** విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, ప్రభుత్వ పాఠశాలలను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండల పరిధిలోని శివలింగాపురం గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించేందుకు అవసరమైన అభివృద్ధి పనులు దశలవారీగా చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

**దశ, మణుగూరు:** ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, సంస్థ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలను మణుగూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాదిగ పల్లెల్లో జెండా ఆవిష్కరణలు, కేక్ కటింగ్, శుభాకాంక్షల కార్యక్రమాలతో వేడుకలు జరుపుకున్నారు. మణుగూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పొడుతూరి కళ్యాణ్‌బాబు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెస్పీ జిల్లా సహాయ కార్యదర్శి కొమ్ము హుస్సేన్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో కేవలం 20 మంది కార్యకర్తలతో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం మూడు దశాబ్దాల పాటు నిరంతర పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ (ఏబీసీడీ) సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ పోరాటం ద్వారా మాదిగ, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం సాధించే దిశగా చారిత్రాత్మక విజయాన్ని అందించిందని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని యువత కొనసాగించాలని, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాళ్ల సురేష్, బొమ్మల వెంకటేశ్వర్లు మాదిగ, మందకోటి మాదిగ, అర్ర కనకన్న మాదిగ, తేలూరు నాగయ్య మాదిగ, మంద కృష్ణ మాదిగ, నాగరాజు మాదిగ, బాబన్న, తేల కృష్ణ, మల్లేశ్వరి, ఇంద్ర, కమలమ్మ, శ్రీలక్ష్మి, మౌనిక, శ్రీహర్షతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నాణ్యతలో రాజీ లేదు

**మొదటి పేజీ తరువాయి**

ప్రైవేట్ పాఠశాలలకు అధిక ఖర్చు చేయాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. విద్యారంగంపై ప్రతి ఏడాది రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని, దాన్ని వ్యయంగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు రుణాలు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి కేంద్రాలు, మహిళా క్యాంటీన్లు వంటి పథకాలను వివరించారు. హైదరాబాద్‌లో భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో నిరుపేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలను విస్తరించే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.




## డిజిటల్ గవర్నెన్స్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్

దశ, హైదరాబాద్: ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర పరిపాలనను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, అవసరమైన చట్టాలను రూపొందించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా డిజిటల్ వ్యవస్థను బలోపేతం చేయాలని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపుల వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ అమలుపై సమగ్ర అధ్యయనం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 100 రోజుల్లో నివేదిక సమర్పించి అమలు ప్రక్రియను ఒక కొలిక్కి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.



# తెలంగాణ రోడ్లకు కొత్త దిశ

**మొదటి పేజీ తరువాయి**

ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, శంకర్ నాయక్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు. మునగనూర్‌లో మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం తొర్రూర్ వరకు భారీ రోడ్‌షో నిర్వహించారు. శంకుస్థాపన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి, ఎమ్మెల్యే ప్రసంగించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ తుర్కయాంజాల్, తొర్రూర్, పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన ఆధునిక నాలుగు లేన్ల రహదారులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలు తగ్గడంతో పాటు ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు. ఈ రహదారుల వల్ల పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇబ్రహీంపట్నం ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆ అనుబంధంతోనే ఈ ప్రాంతానికి భారీ రహదారి ప్రాజెక్టులు తీసుకురాగలిగానని చెప్పారు. మరోసారి అవకాశం కల్పిస్తే సంపూర్ణ అభివృద్ధిని సాధిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకే అభివృద్ధి పనులను వేగంగా అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ, అంతర్జాతీయ సమీకృత మార్కెట్, ఆరుట్ల మోడల్ స్కూల్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ఇబ్రహీంపట్నాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టే దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. మంత్రి రాకకు ముందు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వగ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి అభిషేకానందాలయాన్ని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు సందర్శించారు. రాజగోపురం లోపల చిత్రకంఠ స్తంభాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, బాటసింగారం సహకార సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త కురుమ శివకుమార్, పెద్ద అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పండుగల రాజు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ లో మరో అలజడి

**దశ, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి అలజడి బయటపడింది. మంత్రి కొండా సురేఖకు తెలియకుండా దేవాదాయ శాఖ కమిషనర్ తో కడియం శ్రీహరి ఎండోమెంట్ రివ్యూ నిర్వహించారు. స్టేషన్ఘన్పూర్ పరిధిలోని ఆలయాల పరిస్థితులపై హైదరాబాద్లో కడియం శ్రీహరి రివ్యూ నిర్వహించారు. దేవదాయ శాఖ మంత్రినైన తనకే తెలియకుండా కడియం శ్రీహరి రివ్యూ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. కడియం శ్రీహరిపై స్టేట్ కమాండ్కి కాకుండా నేరుగా హైకమాండ్కి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరోవైపు, తనకు చెప్పకుండా హైకమాండ్కి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేయడంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరా తీసారు.

# శానిటేషన్ సిబ్బందికే ఎక్కువ జీతాలు?

**మొదటి పేజీ తరువాయి**

ఇంజినీర్లు, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రోగ్రామర్లు, టీమ్ లీడర్లు, జీఐఎస్ అనలిస్టులు, వెబ్ డిజైనర్లు తదితర పోస్టులు ఉన్నాయి. నోటిఫికేషన్ ప్రకారం హార్డ్‌వేర్ ఇంజినీర్లకు నెలకు రూ.28 వేల వేతనం, సీనియర్ జీఐఎస్ అనలిస్టుకు రూ.37 వేల వరకు, వెబ్ డిజైనర్‌కు రూ.42 వేల వరకు వేతనం ప్రతిపాదించారు. ఈ వేతనాలపై ఐటీ ఉద్యోగులు, అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న శాశ్వత శానిటేషన్ కార్మికులకు సర్వీసు కాలాన్ని బట్టి నెలకు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు వేతనాలు అందుతున్నాయని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. కొత్తగా చేరే శానిటేషన్ సిబ్బందికి కూడా ప్రారంభ వేతనం రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ అంశంపై జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందిస్తూ.. ఔట్‌సోర్సింగ్ ఐటీ ఉద్యోగుల పే స్కేల్‌ను గత ఐదేళ్లుగా సవరించలేదని, 2022 తర్వాత సంబంధిత వేతన సవరణలు అమల్లోకి రాకపోవడంతో పాత వేతనాలనే కొనసాగించాల్సి వస్తోందని వివరణ ఇచ్చారు.అయితే నగర డిజిటల్ సేవలు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, సర్వర్ల నిర్వహణ, నెట్‌వర్క్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ వంటి కీలక బాధ్యతలు నిర్వహించే ఐటీ నిపుణులకు తగిన స్థాయిలో వేతనాలు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# డిజిటల్ పాలిటిక్స్ వర్సెస్ రోడ్ పాలిటిక్స్

## కేటీఆర్ ఆన్‌లైన్ వ్యూహం..

### కవిత క్షేత్రస్థాయి పోరాటం – తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో కొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు సోషల్ మీడియా, మీడియా సమావేశాల ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండగా.. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత క్షేత్రస్థాయిలో ఆందోళనలు, నిరసనలతో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో "డిజిటల్ పాలిటిక్స్ వర్సెస్ రోడ్ పాలిటిక్స్" అనే చర్చ మొదలైంది. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తర్వాత కవిత తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. ఉద్యమకారుల సమస్యలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, నిరుద్యోగుల అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుని రోడ్లపై నిరసనలు చేపడుతున్నారు. ఇటీవల బోడుప్పల్ ప్రాంతంలో నిర్వహించిన ఆందోళనలో పోలీసులతో వాగ్వాదం అనంతరం




ఆమె అరెస్టు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అదే సమయంలో కేటీఆర్ ప్రధానంగా సోషల్ మీడియా వేదికలు, ప్రెస్‌మీట్లు, ప్రభుత్వ విధానాలపై డిజిటల్ ప్రచారం ద్వారా ప్రతిపక్ష రాజకీయాలను కొనసాగిస్తున్నారు. ఈ రెండు భిన్న రాజకీయ శైలులపై బీఆర్ఎస్ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా, "తెలంగాణ రక్షణ సేన (TRS)" పేరుకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇప్పటికే ఆ పేరుతో పోలిక ఉన్న రాజకీయ పార్టీలు నమోదై ఉండటంతో ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని నోటీసులు జారీ చేసింది. అయితే పేరు మార్చే ఉద్దేశం లేదని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చిన తర్వాత పార్టీ తన గుర్తింపును కోల్పోయిందని భావించే కొంతమంది పాత ఉద్యమకారులు ఉన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ పేరుపై కవిత చేస్తున్న ప్రయత్నాలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే, కవిత కొత్త పార్టీ ప్రభావం, బీఆర్ఎస్ కేడర్‌పై దాని ప్రభావం, భవిష్యత్తు రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయన్నది ఇప్పుడే నిర్ధారించడం సాధ్యం కాదు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపు తిరుగుతాయన్నదే ఆసక్తికరంగా మారింది.

# గులాబీకి మల్లారెడ్డి గుడ్‌బై..?

**మొదటి పేజీ తరువాయి**

వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు దారితీసింది. గతంలో అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్‌లో కీలక నాయకుడిగా గుర్తింపు పొందిన మల్లారెడ్డి, ఇటీవల పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదు. కే.టి. రామారావు, టి. హరీశ్ రావు పాల్గొనే సమావేశాలకు కూడా ఆయన దూరంగా ఉంటున్నారనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో ఆయన భారతీయ జనతా పార్టీలో చేరే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ప్రచారం కొనసాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు మల్లారెడ్డి లేదా బీజేపీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మల్లారెడ్డి కుటుంబానికి చెందిన డాక్టర్ ప్రీతిరెడ్డి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన ప్రశంసలు, అనంతరం బీజేపీ నాయకులతో సమావేశమైన ఘటన కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. అయితే ఆ భేటీ రాజకీయ సంబంధితది కాదని ఆమె ఇప్పటికే వివరణ ఇచ్చారు. ప్రస్తుతం మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారు. భవిష్యత్ రాజకీయ వ్యూహాల నేపథ్యంలో వారి కుటుంబం ఇతర పార్టీలతో సంప్రదింపులు జరుపుతోందనే ప్రచారం ఉన్నప్పటికీ, దీనిపై అధికారిక ధృవీకరణ లేదు.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

**మొదటి పేజీ తరువాయి**

వేగంగా చర్యలు తీసుకునేలా ప్రత్యేక అమలు బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విభాగంలో అనుభవజ్ఞులైన పోలీసు సిబ్బందిని వినియోగించే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాలు, ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలను మరింత పటిష్ఠం చేయడంతో పాటు నకిలీ మందుల ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడం ఈ విభాగం ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. అయితే, "హైడ్రా తరహా చట్టం" అమల్లోకి వచ్చిందని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. ప్రస్తుతం ప్రత్యేక అమలు వ్యవస్థ ఏర్పాటుపై అంతర్గత కసరత్తు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. తుది నిర్ణయం అనంతరం సంబంధిత పరిపాలనా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

# టీఆర్ఎస్ పేరు వివాదం కవితకు హైకోర్టు తాత్కాలిక ఊరట

**దశ, న్యూఢిల్లీ:** టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీ పేరు కేటాయింపు వివాదంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. కేంద్ర భారత ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులపై వారం రోజుల్లో సమాధానం ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. టీఆర్ఎస్ పేరుతో ఇప్పటికే రెండు రాజకీయ పార్టీలు నమోదై ఉండటంతో అదే పేరును కేటాయించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఈసీ కోర్టుకు తెలిపింది. ఈ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు కూడా వెల్లడించింది. కవిత తరపు న్యాయవాది మాత్రం నోటీసులపై పూర్తి స్థాయిలో వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండానే ప్రతికూల నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు.. కవిత వారం రోజుల్లో తన అభిప్రాయాలను సమర్పించిన అనంతరం వ్యక్తిగతంగా కూడా ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

# నిద్రిస్తున్న వృద్ధురాలిపై అత్యాచారయత్నం కలకలం

**ప్రతిఘటించడంతో బాత్రూంలో దాక్కున్న నిందితుడు..**

**స్థానికుల సమాచారంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు.**

**దశ, జనగామ:** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు గ్రామంలో ఓ వృద్ధురాలిపై అత్యాచారయత్నం జరిగిన ఘటన కలకలం రేపింది. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై కాంగ్రెస్ పార్టీ 9వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న చౌదరపల్లి సంపత్‌రాజ్ అత్యాచారానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వృద్ధురాలు ప్రతిఘటించడంతో నిందితుడు ఇంట్లోని బాత్రూంలోకి వెళ్లి దాక్కున్నట్లు సమాచారం. బాధితురాలి కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. 100కు డయల్ చేయడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సంపత్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# ప్రియుడి కోసం భర్త హత్య.. ఏడు నెలల తర్వాత వెలుగులోకి నిజం

**దశ, హైదరాబాద్:** నగరంలోని మియాపూర్లో సంచలనం సృష్టించిన మిస్సింగ్ కేసు ఏడు నెలల తర్వాత హత్య కేసుగా మారింది. భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్యే ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో నిర్ధారించారు. గత ఏడాది నవంబర్‌లో భర్త కనిపించడం లేదని ఫిర్యాదు అందుకున్న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాల్ డేటా, సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాలను పరిశీలించగా భార్య పాత్రపై అనుమానం బలపడింది. విచారణలో భర్త వెంకటేష్ (45)ను ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు ఆమె అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. హత్య అనంతరం మృతదేహాన్ని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి తరలించి పూడ్చిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. తన ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఈ హత్యకు పాల్పడినట్లు నిందితురాలు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న ప్రియుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం..

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించారు. మంగళవారం భవనాల నిర్మాణ పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ, తొలి విడతలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న లేదా శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాల నిర్మాణానికి రూ.263 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాల నిర్మాణానికి రూ.97 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మొత్తంగా రెండు శాఖలకు సంబంధించిన రూ.360 కోట్ల పరిపాలనా అనుమతులు ప్రభుత్వం జారీ చేసినట్లు చెప్పారు. అన్ని భవనాలను ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేలా రూపకల్పన చేస్తున్నామని, నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్కు అప్పగించినట్లు మంత్రి తెలిపారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com